నగరానికి పండగ శోభ

విజయనగరం ఉత్సవాలు ఓ వైపు.. పైడితల్లి సిరిమాను సంబరం మరోవైపు.. దసరా ఇంకోవైపు.. ఇంకేముంది.. నగరమంతా సందడే సందడి. పండగకు దేవస్థానం అధికారులు


భక్తుల కోసం క్యూలైన్ల ఏర్పాటు


కళకళలాడుతున్న మార్కెట్

ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే దేవస్థానానికి ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలంలో భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వాటిపై తాటాకు పందిళ్లు వేస్తున్నారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల తయారీ జోరందుకుంది. తొలేళ్లు, సిరిమానోత్సవానికి సుమారు 30 వేల లడ్డూలు, 30 వేల పులిహోర ప్యాకెట్లు తయారు చేస్తున్నారు. –న్యూస్‌టుడే, కంటోన్మెంట్, పట్టణం

దరఖాస్తుల కిక్కు



● ఉమ్మడి జిల్లాల్లో ఇంకా పెరిగే అవకాశం

ఈనాడు–విజయనగరం: ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాల లైసెన్స్‌కు ఎక్సైజ్ అధికారులు ఊహించిన దాని కంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. వ్యాపారుల మధ్య పోటీ వాతావరణం కనిపించింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు విజయనగరం జిల్లాలో 153 దుకాణాలకు 5,050, మన్యం జిల్లాలో 52 దుకాణాలకు 1,328 దరఖాస్తులు వచ్చాయి. రాత్రి 12 గంటల వరకు గడువు ఉన్నందున 7 వేలకు పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు. సిండికేట్లు దుకాణాలు ఇతరులకు వెళ్లనివ్వకుండా వ్యూహాత్మకంగా ఎక్కువ దరఖాస్తులు దాఖలు చేశారు.

శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఇలా..

జిల్లా	దుకాణాలు	దరఖాస్తులు	ఆదాయం (రూ.కోట్లలో)
పార్వతీపురం మన్యం	52	1,376	27.52
విజయనగరం	153	5,050	101

రూ.128.52 కోట్ల ఆదాయం

దరఖాస్తుదారుల నుంచి ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల తిరిగి చెల్లించని రుసుము వసూలు చేశారు. వీటిపై ఉభయ జిల్లాల రూ.127.56 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి జమైంది. తుది లెక్కలు తేలిన తర్వాత మరికొంత ఆదాయం పెరిగే అవకాశం ఉంది. శుక్రవారం రాత్రి 7 గంటలకు ఎంత మంది ఉన్నా వారికి టోకెన్లు ఇచ్చి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని ఎక్సైజ్ ఉప కమిషనర్ బాబ్జీరావు 'ఈనాడు'కు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వారు రాత్రి 7 గంటల్లోగా రిజిస్ట్రేషన్ చేసుకుంటే రాత్రి 12 గంటల వరకు తీసుకుంటామని చెప్పారు. శనివారం ఉదయానికి కచ్చితమైన సమాచారం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 14న దుకాణాల వారీగా డ్రా తీసి వాటికి లైసెన్సులు జారీ చేస్తామని చెప్పారు.

బుడాలో ఖాళీ కుర్చీలే పాలన

బొబ్బిలి, న్యూస్‌టుడే

బొబ్బిలి పట్టణ అభివృద్ధి అథారిటీ (బుడా) అవతరించి దాదాపుగా ఆరేళ్లు అవుతోంది. ఇంత వరకు పూర్తిస్థాయి కార్యాలయానికి నోచుకోలేదు. విభాగాలు కూడా లేవు. గత ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి సారించకపోగా ఉద్యోగులను నియమించకుండా గాలికి వదిలేసింది. కూటమి ప్రభుత్వం ఖాళీల వివరాలను నివేదించాలనడంతో అధికారులు దస్త్రాలను పంపారు.



ఇవి ఉండాలి

బుడా అభివృద్ధికి ప్రధానంగా ఐదు విభాగాలు అంటే.. ప్రణాళిక, ఎస్టేట్, ఎస్టాబ్లిష్‌మెంటు, పరిపాలన, వనరుల అభివృద్ధి వంటివి ఏర్పాటు కావాలి. ఒక్కో విభాగంలో కనీసం ఐదుగురు ఉద్యోగులు ఉండాలి. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతుల్లో నియమించుకునే వెసులుబాటు ఉన్నా ముందుకు వెళ్లలేదు. అన్ని విభాగాల్లో 30 మందికి పైగా సిబ్బంది పనిచేయాల్సి ఉండగా నియామకమే జరగలేదు.

ఒకే ఒక్కరు

బుడాలో ప్లానింగ్ అధికారి మినహా ఎవరూ లేరు. పరిపాలన అధికారి సత్యనారాయణను సాలూరు కమిషనర్‌గా, కార్యదర్శి లక్ష్మిని ఏడాది కిందట బదిలీ చేశారు. ఆ స్థానంలో ఎవరినీ నియమించలేదు. పరిపాలన, ఎస్టాబ్లిష్‌మెంటు, ఎస్టేట్, వనరుల అభివృద్ధికి అధిపతులు లేరు. సచివాలయ సిబ్బంది ముగ్గుర్ని డిప్యూటేషన్‌పై గతంలో తీసుకువచ్చారు. వారు కంప్యూటర్ విధులు నిర్వహిస్తున్నారు. అథారిటీలకు జిల్లా సంయుక్త కలెక్టర్లు ఉపాధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. దీనిలో భాగంగా ఇటీవల బుడాకు జేసీ సేధుమాధవన్ ఉపాధ్యక్షుడిగా నియమించారు.

పాలకవర్గం భర్తీ ఎప్పటికో

బుడాకు ఆరు నెలలుగా పాలకవర్గం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నియామకానికి అడుగులు పడనున్నాయి. నామినేటెడ్ పదవుల భర్తీలో భాగంగా అధిష్ఠానం నడుం బిగించింది. స్థానిక శాసనసభ్యుడు బేబినాయన సూచించిన నేతకు పదవి దక్కే అవకాశాలు ఉన్నాయి. చాలా మంది పావులు కదుపుతున్నారు. మరి ఎవరికీ దక్కుతుందో చూడాల్సిందే. పాలకవర్గం వస్తే తప్ప అభివృద్ధి పరంగా ముందుకు వెళ్లే పరిస్థితులు కనిపించడం లేదు.

బుడా నేపథ్యం

★ అవతరణ: 2019, ఫిబ్రవరి
★ పరిధి: 2874.77 చదరపు కిలోమీటర్లు
★ మండలాలు: 17
★ పంచాయతీలు: 840
★ పురపాలక సంఘాలు: బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు

రూ.కోట్లలో ఆదాయానికి గండి

గ్రామాలు, పట్టణాల అభివృద్ధి (పీపీ), ప్రాంతాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పట్టణాలకు బృహత్తర ప్రణాళికలు (మాస్టర్ ప్లాన్లు), మౌలిక సదుపాయాల కల్పన (ఐడీపీ) వంటి ప్లానులు తయారు చేయాలి. అదేవిధంగా బహుళ అంతస్తుల భవనాలకు ప్లాన్లు మంజూరు చేయడం, లేఅవుట్ల క్రమబద్ధీకరణ వంటి కీలక పనులు బుడా చేపట్టాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో సిబ్బంది పర్యటించి వాటిని గుర్తించి నిబంధనల మేరకు ఫీజులు కట్టేలా చూడాలి. కానీ చాలామంది బుడాను ఆశ్రయించడం లేదు. అవగాహన రాహిత్యం కారణంగా దరఖాస్తులు చేయడం లేదు. వారిలో చైతన్యం కల్పించేందుకు సిబ్బంది లేరు. ఫలితంగా ఏడాదికి బుడాకు వచ్చే ఆదాయం కేవలం రూ.8 కోట్లు మాత్రమే. వాస్తవానికి రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు సమకూరాలి.

ఉన్నతాధికారులకు నివేదించాం

బుడాకు సిబ్బంది లేరన్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని బుడా పీవో దేవకుమార్ తెలిపారు. అయినప్పటికీ అనధికార లేఅవుట్లు గుర్తించి చర్యలు తీసుకుంటున్నామని, పాలకవర్గంపై ఉన్నత స్థాయిలో నిర్ణయం తీసుకోవాలని చెప్పారు.


జ్యోతి వెలిగిస్తున్న మంత్రి శ్రీనివాస్, పక్కన అశోక్, అదితి, కలెక్టర్

డ్వాక్రా ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు

ఈనాడు– విజయనగరం, న్యూస్‌టుడే, విజయనగరం మయూరి కూడలి: జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేస్తున్న ఆహారోత్పత్తులు, గృహోపయోగ వస్తువులు, దుస్తులు, ఖాదీ, ప్రకృతి సిద్ధమైన అలంకరణ సామగ్రి, నార సంచులకు అంతర్జాతీయ మార్కెట్లో గుర్తింపు తీసుకొస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. విజయనగరం ఉత్సవాలు, పైడితల్లమ్మ పండగ నేపథ్యంలో డీఆర్‌డీఏ, నాబార్డు, ఇతర బ్యాంకుల సహకారంతో అఖిల భారత డ్వాక్రా బజార్ (సరస్-2024)ను కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. వివిధ జిల్లాలు, రాష్ట్రాల వారు తయారు చేసిన వస్తువుల ప్రదర్శనలను ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతి రాజు, పేదరిక నిర్మూలన సంస్థ సీఈవో వీరపాండ్యన్, కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేధుమాధవన్‌తో కలిసి సందర్శించారు. 18 రాష్ట్రాల నుంచి 70 ప్రదర్శనలు, రాష్ట్రం నుంచి 26, జిల్లా నుంచి 90, మెప్మా ద్వారా 70, నాబార్డు ద్వారా 30 స్టాళ్లు ఏర్పాటు చేశారు. మహిళలు తయారు చేస్తున్న వస్తువులు అమరావతిలో నిత్యం అందుబాటులో ఉండేలా ప్రత్యేక వేదిక ఏర్పాటుపై సీఎం యోచిస్తున్నారని తెలిపారు.

మహిళలకు ముఖ్యమంత్రి అండ

మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు అన్నారు. వారు తయారు చేసిన ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చేలా ఆన్‌లైన్ మార్కెటింగ్ విధానం తీసుకొచ్చామని చెప్పారు. స్వయం ఉపాధి దిశగా అంచెలంచెలుగా ఎదగాలని, ప్రతి ఒక్కరూ లక్షాధికారి కావాలన్నదే ప్రభుత్వం ధ్యేయమని చెప్పారు.

ప్రత్యేక ఆకర్షణగా బెలూన్ షో

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: విజయనగరం ఉత్సవాల్లో ఈ ఏడాది ఎయిర్ బెలూన్ షో ప్రధాన ఆకర్షణగా నిలవనుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, సంయుక్త కలెక్టర్ సేదు మాధవన్‌తో కలిసి శుక్రవారం ఉత్సవ వేదికలను పరిశీలించారు. ప్రజలంతా వచ్చి ఉత్సవాలను తిలకించి ఆనందించాలని పిలుపునిచ్చారు. సాహస క్రీడలో పాల్గొనే అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ప్రధాన వేదికైన అయోధ్య మైదానానికి చేరుకొని, తర్వాత కోట సుందరీకరణ పనులు పరిశీలించారు. వెనుక భాగంలో ఏర్పాటు చేస్తున్న లాన్, దక్షిణ భాగంలో నిర్వహించనున్న లేజర్‌షో ఏర్పాట్లను శనివారానికి పూర్తి చేయాలని ఆదేశించారు. సీపీవో బాలాజీ, పర్యాటక, ఆర్‌అండ్‌బీ, జడ్పీ అధికారులు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.


పూడిక తొలగిస్తున్న జన్నివలస రైతులు

300 ఎకరాల కోసం.. 30 మంది కదిలారు

పాచిపెంట, న్యూస్‌టుడే: పెద్దగెడ్డ జలాశయం నుంచి వేల ఎకరాలకు సాగునీరు వెళ్తుంది. మన్యం, విజయనగరం జిల్లాల పరిధిలోని పలు గ్రామాల రైతులకు ఈ జలాలే ఆధారం. కానీ కాలువలు అధ్వానంగా ఉండటంతో పూర్తిస్థాయిలో చేరడం లేదు. ప్రాజెక్టుకు విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం జన్నివలస శివారు ఆయకట్టు గ్రామం. అక్కడి రైతులు 300 ఎకరాల్లో పంటలు వేశారు. కానీ నీటి ప్రవాహం అందక వరి పంట ఎండిపోయే స్థితికి చేరింది. ఏటా ఇదే సమస్యతో నష్టపోతున్నామని రైతులు చెబుతున్నారు. చేసేది లేక 30 మంది ఏకమయ్యారు. కాలువ మొదట నుంచి గ్రామం వరకు 12 కిలోమీటర్ల పరిధిలో పూడిక తొలగింపునకు నడుం బిగించారు. శుక్రవారం పాచిపెంట ప్రధాన కాలువ రెండో కిలోమీటరు నుంచి పనులు ప్రారంభించారు. తమ పొలాలకు నీరు వచ్చే వరకు పూడిక తీస్తామని రైతు పి.యోగినాయుడు తదితరులు చెబుతున్నారు.

తెలిసిన వాడే కీచకుడు

మతిస్థిమితం లేని యువతి అపహరణ, అత్యాచారం



విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: తెలిసిన వాడే కీచకుడు అయ్యాడు. మతిస్థిమితం లేని యువతిని అపహరించి, ఆమెపై అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భీమిలి స్టేషన్ పరిధిలోని ఓ కోళ్లఫారంలో పాచిపెంట మండలానికి చెందిన పి.శ్రీధర్ (45) తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి పనిచేసేవాడు. అక్కడే ఉంటున్న మతిస్థిమితం లేని ఓ యువతి(20) కుటుంబంతో పరిచయం ఏర్పడింది. కొన్నాళ్లకు పని మానేసిన శ్రీధర్ ఈ నెల 3న యువతి తండ్రి ద్విచక్ర వాహనంపై ఆమెను విజయనగరం సమీపంలోని గొట్లాం బైపాస్ వద్దకు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమెతో పాటు వాహనాన్ని బైపాస్ రోడ్డుపై వదిలేసి పరారయ్యాడు. అదేరోజు తమ కుమార్తెను శ్రీధర్ తీసుకెళ్లాడని, ఫోన్ చేస్తుంటే స్పందించట్లేదని భీమిలి పోలీసు స్టేషనులో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని బాధితులు చెబుతున్నారు. అదేరోజు మతిస్థిమితం లేని అమ్మాయి రహదారి పక్కన చాలా సేపట్నుంచి ఉందని గుంకలాం గ్రామస్థులు విజయనగరం గ్రామీణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అమ్మాయి వివరాలేవీ చెప్పలేకపోవడంతో స్కూటీపై నంబరు ఆధారంగా వివరాలు సేకరించగా, భీమిలి చిరునామా, తండ్రి ఫోన్ నంబరు వచ్చాయి. ఆయనకు ఫోన్ చేసి చెప్పగా వచ్చి కుమార్తెను తీసుకెళ్లారు. శరీరంపై గాయాలు చూసిన కుటుంబీకులు మళ్లీ భీమిలి పోలీసుల వద్దకు వెళ్లినా విజయనగరం వెళ్లమని పంపేశారు.

వారం తర్వాత దర్యాప్తు

ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో భీమిలి పోలీసులు వారం తర్వాత జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి విజయనగరం పోలీసులకు బదలాయించారు. విజయనగరం ఎస్పీ వకుల్ జిందాల్ స్పందించి కేసు దర్యాప్తు బాధ్యతను మహిళా స్టేషన్‌కు అప్పగించారు. సీఐ నర్సింహమూర్తి ప్రత్యేక బృందాలను నియమించి, పాచిపెంట మండలం పి.కోనవలసలో నిందితుడు శ్రీధర్‌ను పట్టుకుని, ఈ నెల 10న రిమాండుకు తరలించారు. నిందితుడు తమ కుటుంబంతో నమ్మకంగా ఉండేవాడని బాధిత తల్లిదండ్రులు వాపోయారు. ఇలా చేస్తాడని ఊహించలేదని కంటతడి పెట్టారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు పెరుగుతున్న నిత్యావసరాల ధరలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో రాయితీ ధరపై టమాటా, కందిపప్పు, నూనెల విక్రయాలు ప్రారంభమయ్యాయి. విజయనగరం, ఎస్.కోట, కొటారుబిల్లి, చీపురుపల్లి, రాజాంలోని ఏడు రైతు బజార్లలో 9వ తేదీ నుంచి టమాటా, కందిపప్పు విక్రయాలు జరుగుతున్నాయి. శుక్రవారం నుంచి పామాయిల్, రిఫైండ్ ఆయిల్ అందుబాటులోకి వచ్చాయి.

న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్, ఉడాకాలనీ

దిగొచ్చిన టమాటా



రైతు బజార్లలో రాయితీపై ప్రారంభమైన విక్రయాలు

5 టన్నుల అమ్మకం

ఇటీవల దారెత్తిన టమాటా ధరలు ఎట్టకేలకు దిగొచ్చాయి. బహిరంగ మార్కెట్లో కిలో రూ.100 పలికిన ధర ప్రస్తుతం సగానికి తగ్గింది. తొలుత రైతు బజార్లలో ఈ నెల 9న కిలో రూ.50కి విక్రయాలు ప్రారంభించారు. శుక్రవారం నుంచి రూ.45 చేశారు. బహిరంగ మార్కెట్లో ధర అధికంగా ఉండడంతో వినియోగదారులు బారులు తీరారు. శుక్రవారం ఒక్క రోజే జిల్లాలోని అన్ని రైతు బజార్లలో 5 టన్నుల వరకు విక్రయించినట్లు అధికారులు వెల్లడించారు. కందిపప్పు కిలో రూ.145కు విక్రయిస్తున్నారు. బయట రూ.180 వరకు పలుకుతోంది.

నూనెల ధరలు ఇలా..

బ్రాండ్	ధర (రూ.)
పామాయిల్ (ఆల్ఫా)	110
రిఫైండ్ ఆయిల్ (ఫ్రీడం)	120
రిఫైండ్ ఆయిల్ (గోల్డ్‌డ్రాప్)	124


రైతు బజారు వద్ద టమాటా కోసం వరుస కట్టిన వినియోగదారులు

కొన్ని రోజులుగా బహిరంగ మార్కెట్లో నూనెల ధరలు అనూహ్యంగా పెరిగాయి. శుక్రవారం నుంచి పామాయిల్, రిఫైండ్ ఆయిల్‌ను రైతు బజార్లలో అందుబాటులో ఉంచడంతో ప్రజలకు కొంత భారం తగ్గనుంది. బహిరంగ మార్కెట్ కన్నా లీటరుకు రూ.10 నుంచి రూ.20 వరకు తక్కువగా విక్రయిస్తున్నందున వినియోగదారులు మొగ్గు చూపుతున్నారు. విజయనగరం, ఎస్.కోట రైతు బజార్లలో శుక్రవారం ఒక్కరోజే 350 ప్యాకెట్లు అమ్మారు. పండగ, ధరల భారంతో వినియోగదారులు రైతుబజార్ల వైపు మొగ్గుచూపుతున్నారని పౌర సరఫరాల అధికారి మధుసూదనరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. వ్యాపారుల ద్వారా విక్రయ కేంద్రాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

సాధారణ భక్తులకు ఆటంకాలొద్దు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: పైడితల్లి అమ్మవారి దర్శనానికి మంత్రుల స్థాయి వీఐపీలు వచ్చేటప్పుడు తప్ప, ఇతర సందర్భాల్లో సాధారణ భక్తుల క్యూలైన్లు నిలిపివేయవద్దని కలెక్టర్ డా.బి.ఆర్.అంబేడ్కర్ ఆదేశించారు. అందరికీ త్వరగా దర్శనమయ్యేలా చూడాలన్నారు. తన ఛాంబర్లో శుక్రవారం అమ్మవారి పండగ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. క్యూలైన్లలో ఇచ్చే మజ్జిగ, ఉచిత ప్రసాదాలు, తాగునీటిని తనిఖీ చేయాలని ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులకు సూచించారు. శాంతి భద్రతలకు భంగం కలగకుండా పోలీసు అధికారులు జాగ్రత్త వహించాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ క్రమపద్ధతిలో ఉండాలన్నారు. సిరిమానోత్సవానికి అన్ని సంప్రదాయాలు పాటిస్తూ భక్తుల మనోభావాలకు తగ్గట్లుగా నిర్వహించాలని సూచించారు. సిరిమాను వద్ద పనిచేసే సిబ్బంది నిర్ణీత సమయానికి ప్రారంభమయ్యేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. అటవీ, రెవెన్యూ అధికారులు దగ్గరే ఉండి పర్యవేక్షించాలని, తొక్కిసలాట జరగకుండా సిరిమాను తిరిగే ప్రాంతంలో ఇతరులు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ సేధు మాధవన్, డీఆర్వో అనిత, ఆర్డీవో దాట్ల కీర్తి, డీఎస్పీ శ్రీనివాసరావు, ఈవో ప్రసాదరావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ కాంతిమతి, మాన్సాస్ ఈవో ప్రసాద్, పూజారులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

మార్కెట్ కమిటీలపై నిఘా నేత్రం

ఆదాయం మెరుగుకు విజిలెన్స్ కమిటీలు

న్యూస్‌టుడే, బొబ్బిలి

ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల ఆదాయం మెరుగుకు ప్రభుత్వం విజిలెన్సు కమిటీలు ఏర్పాటు చేసింది. చెక్‌పోస్టుల వద్ద వాహనాలను ఆపి రవాణా అవుతున్న వ్యవసాయ ఉత్పత్తులపై రెండు శాతం పన్ను వసూలు చేసి రసీదులు అందజేయాలి. కొన్నిచోట్ల ఇది పక్కాగా జరగడం లేదు. అక్కడి సిబ్బంది చేతివాటం చూపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి అడ్డుకట్ట వేసేందుకు ఉన్నతాధికారులు విజిలెన్సు కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ నెల నుంచే ఆకస్మిక సోదాలు నిర్వహించి ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నారు.


బొబ్బిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

సభ్యులు వీరే

★ విజయనగరం జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి నేతృత్వంలో కార్యదర్శుల హోదాలో పనిచేస్తున్న జి.చంద్రమౌళి, ఆర్.సతీష్, ఆర్.విజయబాబు, కె.ఈశ్వరరావు కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు.

★ మన్యం జిల్లాలో జిల్లా మార్కెటింగ్ ఇన్‌ఛార్జి అధికారి జీఆర్ రావు ఆధ్వర్యంలో కార్యదర్శులు వి.సతీష్‌కుమార్, వి.ఆర్.వి.ఎస్ ధీరజ్‌రాజు, టి.అనిల్ ప్రసాద్, నరేష్‌కుమార్ నియమితులయ్యారు.

★ వీరు ఉమ్మడి జిల్లాలోని 13 కమిటీల పరిధిలో చెక్‌పోస్టుల సందర్శన, సెస్ వసూళ్ల తీరు, కమిటీల ఆదాయ వ్యయాలు, ఖర్చుల వివరాలపై సోదాలు చేయనున్నారు.

నిధులు పక్కదారి పట్టకుండా..

మార్కెట్ కమిటీల్లో నిధులు పక్కదారి పట్టకుండా కమిటీలు నిఘా పెడతాయి. గత ప్రభుత్వ హయాంలో కమిటీల్లో రూ.కోట్లు దుర్వినియోగమయ్యాయి. పొరుగు జిల్లాలో ఓ కమిటీ కార్యదర్శి రూ.2 కోట్లపై చిలుకు ఆయన సొంత ఖాతాకు మళ్లించుకున్నారు. ఇలాంటివి జరగకుండా విజిలెన్సు కమిటీలు పర్యవేక్షించనున్నాయి. ప్రస్తుతం పాలక వర్గాలు లేకపోవడంతో ఉద్యోగులే కీలకమయ్యారు. పన్నుల వసూళ్లు పారదర్శకంగా చేపట్టేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కమిటీలు ఏర్పాటు చేసినట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి రవికృష్ణ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

● ఉమ్మడి జిల్లాలో కమిటీలు: 12 ● ఏడాదికి పన్నుల లక్ష్యం: రూ.17.12 కోట్లు ● ప్రస్తుతం వసూలవుతుంది: దాదాపు రూ.12.67 కోట్లు

జయ జయహే మహిషాసురమర్దిని



చీపురుపల్లి మానసాదేవి



మహాలక్ష్మి ఆలయంలో మంత్రి పూజలు


శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చీపురుపల్లిలో మానసాదేవి అమ్మవారు మహిషాసురమర్దిని అలంకారంలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. దత్తిరాజేరు మండలం చౌడవాడలోని ఉదయాల్లి మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, వంగరలోని రుషిణి దుర్గాభవానీ ఆలయంలో దిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుషార్‌రావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. – చీపురుపల్లి గ్రామీణం, దత్తిరాజేరు, వంగర

కోటలో ఆయుధ పూజ



హారతి ఇస్తున్న సుజయ్

బొబ్బిలి కోటలో శుక్రవారం సంప్రదాయబద్ధంగా ఆయుధ పూజ జరిగింది. ఏటా దసరా ముందు రోజు వారసులు పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. బొబ్బిలి యుద్ధంలో వినియోగించిన కత్తులు, బల్లేలు, ఇతర ఆయుధాలకు మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, సోదరులు, ఎమ్మెల్యే బేబీనాయన, వినీత్ పూజలు నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆర్‌ఎస్‌ఆర్‌కే రంగారావు, తండ్రి ఆర్‌వీజేకే రంగారావు, వారి బంగారు, వెండి సింహాసనాలు, కత్తులు పూజించారు. దర్బార్ మహల్‌లో రాజదర్బారు ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్డీవో రామ్మోహన్, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు సతీష్‌కుమార్, నారాయణరావు, చిన్నంనాయుడులతోపాటు బొబ్బిలి, పార్వతీపురం నియోజకవర్గాల నుంచి అభిమానులు, కార్యకర్తలు హాజరయ్యారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి



బంగారు సింహాసనానికి పూజలు చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే బేబీనాయన



కోటలో కోలాటం ప్రదర్శన



వృద్ధురాలి అనుమానాస్పద మృతి

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని బాబానగర్ మూడో వీధికి చెందిన బి.యశోద(62) అనుమానాస్పదంగా మృతి చెందారు. గురువారం రాత్రి తనింట్లో నిద్రించిన ఈమె శుక్రవారం ఉదయం చాలా సమయం అయినా బయటకు రాకపోవడం, అలికిడి లేకపోవడంతో కింద ఇంట్లో ఉంటున్నవారు గుర్తించి తలుపు కొట్టినా ప్రయోజనం లేకపోయింది. స్థానికులు బలవంతంగా తలుపులు తెరిచి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై రవికిరణ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వృద్ధురాలి మెడలోని బంగారం గొలుసు చోరీకి గురైనట్లు తొలుత ప్రచారం జరిగినా దీన్ని పోలీసులు నిర్ధారించలేదు. బయట వ్యక్తులెవరూ లోనికి వచ్చిన ఆనవాళ్లు లేవని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఈమెకు ముగ్గురు కుమారులు. వీరంతా వేర్వేరు ప్రాంతాల్లో ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. భర్త మృతి చెందడంతో ఒంటరిగానే ఇంట్లో ఉంటున్నారు. కుమారుడు గిరీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ గిరీష్‌కుమార్ తెలిపారు.

సెలవులకు వచ్చి మృత్యువాత

గుర్ల, న్యూస్‌టుడే: వ్యాను ఢీకొనడంతో బాలుడు మృతి చెందిన ఘటన పాలవలసలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై పి.నారాయణరావు వివరాల ప్రకారం.. విశాఖపట్నానికి చెందిన చింతల ఈశ్వరరావు కుమారుడు షణ్ముఖ్(5) దసరా సెలవులకు తాత గారింటికి వచ్చాడు. శుక్రవారం గ్రామంలోని ఓ కల్లం వద్ద ఆడుకుంటుండగా వ్యాను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే విజయనగరం ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.




షణ్ముఖ్ (పాత చిత్రం)

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

బాడంగి(రామభద్రపురం), న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బాడంగి మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై తారకేశ్వరరావు వివరాల మేరకు.. బొబ్బిలి పట్టణానికి చెందిన సి. రామారావు(41) గురువారం మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన ఆయన అత్తవారి ఊరు బాడంగి మండలం వీరసాగరం శివారుకు చేరుకుని పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న బంధువులు బాడంగి సీహెచ్‌సీకి, అక్కడి నుంచి విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రామారావు శుక్రవారం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జూదరుల అరెస్టు.. గుర్ల, న్యూస్‌టుడే: పెదబంటుపల్లి వద్ద జూదం ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై పి.నారాయణరావు తెలిపారు. వారి నుంచి రూ.6,210 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.




దసరా శోభ



కొనుగోలుదార్లతో రద్దీగా మారిన సిటీ స్టాండు దారి

విజయనగరం నగర పాలక సంస్థకు దసరా పండగ శోభ వచ్చింది. గంటస్తంభం మార్కెట్, సిటీ స్టాండ్ దారి, నగర పాలక సంస్థ కార్యాలయం దారి, ప్రకాశం పార్కు రోడ్డు, కన్యకా పరమేశ్వరి కోవెల మార్గం పూజా సామగ్రి కొనుగోలుకు వచ్చిన వారితో రద్దీగా మారాయి. అరటిపండ్లు, నిమ్మకాయలు, నల్లజీడి పిక్కలు, దుర్గాదేవి ఫొటోలు, సింధూరం తదితర అమ్మకాలు జరిగే చోట్ల జనం గుంపులుగా చేరి కొనుగోలు చేశారు. మిఠాయి, వస్త్ర దుకాణాలు, బంగారం, వెండి ఆభరణాల దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడాయి. కొత్త వాహనాల కొనుగోలుకు వచ్చిన వారితో షోరూమ్‌లు సందడిగా కనిపించాయి.

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం



గంటస్తంభం మార్కెట్..

జాతీయస్థాయిలో సత్తా

బొబ్బిలి, న్యూస్‌టుడే: సాఫ్ట్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో బొబ్బిలి క్రీడాకారులు సత్తా చాటారు. ఈనెల 8 నుంచి 10 వరకు కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బాలుర విభాగంలో వేణు, జశ్వంత్ తృతీయ స్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో సుప్రియ, తేజ, చైతన్య కుమారి సూపర్-8కి అర్హత సాధించారు. త్వరలో జాతీయ స్థాయి పోటీలకు వెళ్లనున్న వీరిని ఎమ్మెల్యే బేబీనాయన శుక్రవారం కోటలో అభినందించారు పీడీ వెంకటనాయుడు, సాయిరమేష్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

రాజాం, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని వైసీబీ ఎన్జీవో కమ్యూనిటీ కార్యకర్త వావిలపల్లి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా రాజాం మున్సిపాల్టీ పరిధిలోని సారథిలో ర్యాలీ నిర్వహించారు. బాలికలు, తల్లిదండ్రులతో అవగాహన సమావేశం ఏర్పాటు చేసి చట్టాలను వివరించారు.

బొబ్బిలి

• బొబ్బిలి • రాజాం • గజపతినగరం • చీపురుపల్లి

పైవంతెన పనులు వేగవంతం చేయండి

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: మండలంలోని పెదమానాపురం పైవంతెన పనులను వేగవంతం చేయాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సూచించారు. శుక్రవారం స్వయంగా పనులను పరిశీలించిన ఆయన గుత్తేదారుతోపాటు సంబంధిత జాతీయ రహదారి అథారిటీ అధికారులతో మాట్లాడారు. వచ్చే సంక్రాంతి నాటికి పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. త్వరితగతిన బిల్లులు చెల్లింపులు జరిగేలా కృషి చేస్తానని చెప్పారు. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని చెప్పారు. అనంతరం ఆర్టీసీ బస్సు ఎక్కి అందులోని ప్రయాణికులతో మాట్లాడారు. పెదమానాపురం రైలు గేటు వద్ద సమస్యను అడిగి తెలుసుకున్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎంపీ అప్పలనాయుడు

ఆడపిల్లల్ని కాపాడుకుందాం

బొబ్బిలి, గ్రామీణం, గరివిడి, న్యూస్‌టుడే: ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతోందని, వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రోటరీ క్లబ్ జిల్లా అధ్యక్షుడు జేసీ రాజు అన్నారు. శుక్రవారం ప్రపంచ బాలికల దినోత్సవం సందర్భంగా బొబ్బిలి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బొబ్బిలి మండలం అలజంగి, సీతయ్యపేట, నారాయణప్పవలస గ్రామాల్లో అంగన్వాడీ కార్యకర్తలు బాలికలతో కలిసి అవగాహన ర్యాలీలు నిర్వహించారు. గరివిడి మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలకు బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీలు నిర్వహించారు.

నేడు నిజరూప దర్శనం

రాజాం, న్యూస్‌టుడే: విజయదశమి సందర్భంగా భక్తులు నవదుర్గ అమ్మవారి నిజరూప దర్శనం చేసుకునేందుకు వీలుగా భారీగా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్యామలరావు తెలిపారు. నవమి సందర్భంగా అమ్మవారిని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలోనూ పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రీనివాసరావు శర్మ, రామచంద్రశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వానపల్లి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.



నవదుర్గ అమ్మవారు

ఇతర వీధుల్లోకి వెళ్లొద్దు: సీఐ

రాజాం, న్యూస్‌టుడే: రాజాం గ్రామ దేవత ఉత్సవాల్లో భాగంగా యువత తమ వీధుల్లోనే అమ్మవారి తిరు వీధి ఉత్సవం ఘటాన్ని దర్శించుకోవాలని, ఇతర వీధుల్లోకి వెళ్లొద్దని సీఐ కె.అశోక్‌కుమార్ కోరారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గ్రామ దేవత పండగ సందర్భంగా యువత ఇతర వీధులకు వెళ్తుండడంతో వివాదాలు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. డీజేలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, నిబంధనలు మీరితే కేసులు తప్పవని హెచ్చరించారు.




కె.అశోక్‌కుమార్

ఉచిత వైద్య శిబిరం

వంగర, న్యూస్‌టుడే: రాజాం సురేష్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యుడు యలకల సురేష్ కుమార్ ఆధ్వర్యంలో రుషింగిలో వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 200 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి, మందులు అందించారు.

అపూర్వ సమ్మేళనం

సంతకవిటి, న్యూస్‌టుడే: గుళ్లసీతారాంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 2002-03 సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు శుక్రవారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.



నిందితుల అరెస్టు

బొండపల్లి, న్యూస్‌టుడే: గొట్లాం గ్రామంలో గత నెల 14న ఓ నగల దుకాణంలో జరిగిన చోరీకి సంబంధించి ఇద్దరు నిందితుల్ని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ పి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. వీరు మధ్యప్రదేశ్ రాష్ట్రం గునా జిల్లాకు చెందిన అజయ్, సుల్తాన్‌గా గుర్తించినట్లు చెప్పారు. అరతులం బంగారం, 10 కిలోల వెండి ఆభరణాలు అపహరించారని.. ప్రస్తుతం వీరి నుంచి అరకిలో వెండి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరిపై ఇప్పటికే పలు కేసులు ఉన్నట్లు చెప్పారు. ఎస్సై మహేష్, సిబ్బంది ఉన్నారు.

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట



అశ్వ వాహనంలో వేంకటేశ్వరస్వామి



మహిషాసురమర్దిని అవతారంలో..



దుప్పాడ శ్రీక్షేత్రంలో ఐశ్వర్యలక్ష్మికి అభిషేకాలు

శరణు.. శాంభవీ



దుర్గమ్మగా...

ఉత్తరాంధ్ర ఆరాధ్య దేవత పైడితల్లి అమ్మవారి దీక్షాపీఠం దీక్షాధారులు శుక్రవారం ఘటాలతో ఊరేగారు. దేవస్థానం ఏసీ డి.వి.వి.ప్రసాదరావు ప్రారంభించారు. ఘటాలు శివాలయం వీధి, అంబటిసత్రం మీదుగా చదురుగుడికి ఊరేగింపుగా చేరాయి.

– న్యూస్‌టుడే, కంటోన్మెంట్



ఊరేగింపును ప్రారంభిస్తున్న ఏసీ ప్రసాదరావు

భక్తుల కోర్కెలు తీర్చే జమ్మిచెట్టు



జామి శివాలయం సమీపంలోని చెట్టు

జామి: మండల కేంద్రంలోని త్రిపురాంతక, వేణుగోపాల, జనార్దన స్వామి ఆలయాల సమీపంలోని శమీ వృక్షాలకు(జమ్మి చెట్లు) పురాతన చరిత్ర ఉంది. విజయదశమి రోజు జమ్మిచెట్టుకు పూజలు నిర్వహిస్తే కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. పాండవులు అజ్ఞాతవాసంలో ఉన్నపుడు జమ్మిచెట్టు మీద దాచిన ఆయుధాలతో శత్రువులను ఓడించారని అందుకనే వాటికి పూజలు నిర్వహిస్తున్నారు.

మార్క్‌ఫెడ్ ఛైర్మన్‌కు ఘన స్వాగతం

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజుకు సారిపల్లి గ్రామస్థులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న బంగార్రాజు శుక్రవారం ఆ గ్రామంలో మొదటిసారిగా పర్యటించారు. డప్పులు వాయిద్యాలు, సాముగారడి, మహిళలు హారతులతో ఆహ్వానించి, గజమాలతో సత్కరించారు. అనంతరం కాప్వి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించారు. తెదేపా నాయకులు రాజారావు, అప్పలనాయుడు, ఆదినారాయణ, శ్రీను, వెంకటరావు, బాబూరావు, గోపి పాల్గొన్నారు.



బంగార్రాజును సన్మానిస్తున్న గ్రామస్థులు

బాలికల భవితకు భరోసానిద్దాం

విజయనగరం రింగురోడ్డు: బాలికలకు అన్ని విధాలుగా అండగా ఉందామని, వారికి మంచి భవిష్యత్తును కల్పించేందుకు కృషి చేద్దామని కలెక్టర్ అంబేడ్కర్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్ అండ్ బీ రహదారి కూడలి నుంచి పోలీసు బ్యారెక్స్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. బాలికలకు సామాజికంగా, ఆర్థికంగా, మానసికంగా భరోసానివ్వాలని సూచించారు. జిల్లా యంత్రాంగం తరఫున వారికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని కలెక్టరు హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న కలెక్టరు అంబేడ్కర్

రైతు బజార్‌లో రాయితీపై విక్రయాలు

విజయనగరం అర్బన్, ఉడాకాలనీ: నగరంలోని ఆర్‌అండ్‌బీ శాఖ రైతు బజారులో శుక్రవారం రాయితీపై అందిస్తున్న టమాటా, పామాయిల్ విక్రయాలను మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి ప్రారంభించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, పౌర సరఫరాల సంస్థ కమిషనర్ జి.వీరపాండ్యన్, కలెక్టర్ అంబేడ్కర్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



నూనె ప్యాకెట్లను అమ్ముతున్న ఎమ్మెల్యే అదితి, మంత్రి కొండపల్లి, ఎంపీ కలిశెట్టి

వెయిట్ లిఫ్టింగ్‌లో ఆరు పతకాలు

నెల్లిమర్ల: హిమాచల్‌ప్రదేశ్‌లో జరుగుతున్న జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఆరు పతకాలు సాధించారు. కొండవెలగాడకు చెందిన దినేష్‌కుమార్, భార్గవి, హారిక, చంద్రపేటకు చెందిన గురునాయుడు, కె.అనిల్‌కుమార్, నెల్లిమర్లకు చెందిన బి.చంద్రిక పతకాలు సాధించారు.

పోటీకి మద్దతు ఇవ్వండి

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తనకు మద్దతు తెలపాలంటూ ఎమ్మెల్సీ పి.రఘువర్మ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని కోరారు. శుక్రవారం ఎల్.కోటలోని ఆమె ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. 78 ఏళ్ల చరిత్ర ఉన్న ఏపీటీఎఫ్ మద్దతు తెలియజేస్తుందని ఆమెకు వివరించి చెప్పారు. తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి కేబీవీ రామ్‌ప్రసాద్ ఉన్నారు.



విన్నవిస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ

వెండి ఆభరణాల బహూకరణ

జరజాపుపేట(నెల్లిమర్ల): నగరపంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో ఇటీవల ప్రారంభించిన సంతోషిమాత ఆలయంలో అమ్మవారికి రూ.1.25 లక్షల విలువైన వెండి ఆభరణాలను గ్రామానికి చెందిన గుండోజీ సత్తిబాబు, లక్ష్మణ దంపతులు శుక్రవారం సమర్పించారు. ఉదయం అమ్మవారికి సమర్పించేందుకు మేళతాళాల నడుమ, మంగళవాయిద్యాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా ఆభరణాలను తీసుకొచ్చి బహూకరించారు.



ఎమ్మెల్సీ ఎన్నికలకు సహకరించండి

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: త్వరలో జరుగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీఏ ఎమ్మెల్సీ అభ్యర్థిగా శ్రీనివాసులనాయుడుకు సహకరించాలని మాజీ ఎమ్మెల్యే ఈశ్వరరావును కోరారు. శుక్రవారం రణస్థలంలోని ఆయన స్వగృహంలో పీఆర్టీయూ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఉపాధ్యాయుల సమస్యలను ఆయనకు తెలియజేశారు. మండలాధ్యక్షుడు పీల శ్రీను అధ్యక్షుడు మోహన్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఈశ్వరరావుతో శ్రీనివాసులనాయుడు, తదితరులు

రూ.2 లక్షల బీమా అందజేత

డెంకాడ, న్యూస్‌టుడే: మండలంలో నాతవలస గ్రామానికి చెందిన గేదెల ప్రవీణ్‌కుమార్ గతేడాది డిసెంబరు 24న ప్రమాదవశాత్తు మరణించారు. ఆయన తెదేపా సభ్యత్వ నమోదు చేసుకోవడంతో రూ.2 లక్షలు పరిహారం మంజూరైంది. ఈ మొత్తాన్ని మాజీ ఎంపీపీ చంద్రశేఖర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పతివాడ అప్పలనారాయణ, మండలాధ్యక్షుడు భాస్కరరావు, పార్లమెంటరీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఫణిరాజు చేతుల మీదుగా ఆయన తండ్రి అచ్చెన్న, భార్య గంగకు శుక్రవారం చెక్కు అందజేశారు. ఈసందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ..ప్రమాదంలో మరణిస్తే ఇకపై రూ.5 లక్షల బీమా ఇస్తామన్నారు.



బీమా చెక్కు అందజేస్తున్న తెదేపా నాయకులు

ముగ్గురు యువకుల అరెస్టు

డెంకాడ, న్యూస్‌టుడే: నాతవలస టోల్‌ప్లాజా సమీపంలో చెరువు గట్టుపై గంజాయి తాగుతున్న ముగ్గురు యువకులను పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. భోగాపురం సీఐ జి.రామకృష్ణ వివరాలు ప్రకారం..విశాఖపట్నానికి చెందిన ముగ్గురు యువకులు చింతపల్లి బీచ్‌కు వెళ్లే క్రమంలో టోల్‌ప్లాజా సమీపంలో గంజాయి సేవిస్తున్నారు. వారి నుంచి 200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు.

మహిళా సంఘాలతో చిన్నతరహా పరిశ్రమలు

విజయనగరం గ్రామీణం: మండలంలోని వేణుగోపాలపురం వద్ద ఎస్‌హెచ్‌జీలకు ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు అవసరమైన 14.5 ఎకరాల స్థలాన్ని శుక్రవారం మంత్రి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కలెక్టరు అంబేడ్కర్, ఎమ్మెల్యే అదితి పరిశీలించారు. ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడానికి సిద్ధంగా ఉన్నామని కలెక్టరు వివరించారు. సెర్ప్ సీఈఓ జి.వీరపాండ్యన్, సంయుక్త కలెక్టరు సేధుమాధవన్ పాల్గొన్నారు.

కడలికి ఘన సన్మానం

జరజాపుపేట(నెల్లిమర్ల): జరజాపుపేట ప్రాంతానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, జీవిత సాఫల్యం అవార్డు గ్రహీత కడలి ప్రకాశరావును శుక్రవారం గ్రామపెద్దలు సన్మానించారు. సాహిత్య, చిత్రకళ రంగంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్న ఆయనను కొనియాడారు.



ప్రకాశరావును సన్మానిస్తున్న గ్రామపెద్దలు

పశువుల అక్రమ రవాణాపై కేసు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: పశువులను అక్రమంగా తరలిస్తున్న రెండు వాహనాలను పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. రాజాం నుంచి అలమండ సంతకు 18 పశువులను తరలిస్తున్న నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.గణేష్ తెలిపారు.

ముగ్గురు వ్యక్తులకు గాయాలు

భోగాపురం, న్యూస్‌టుడే: రెండు వాహనాలు ఢీకొని ముగ్గురు వ్యక్తులు గాయపడిన సంఘటన భోగాపురం జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం 4 గంటల సమయంలో విశాఖ నుంచి విజయనగరం వెళ్లే మార్గంలోని అక్కివరం కూడలిలో ఎదురెదురుగా వాహనాలు ఢీకొన్నాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తగరపువలస ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ప్రైవేటు బస్సులపై కొరడా

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: దసరా, విజయనగరం ఉత్సవాలు, పైడితల్లమ్మ జాతర నేపథ్యంలో జిల్లా కేంద్రానికి ప్రయాణికులను తీసుకువచ్చే ప్రైవేటు బస్సుల నిర్వాహకులు నిలువు దోపిడీకి పాల్పడుతున్నారన్న ఫిర్యాదులు అందడంతో రవాణా శాఖ అధికారులు రంగంలోకి దిగారు. 10న ఇన్‌స్పెక్టర్ వెంకటరావు 9 బస్సులపై, 11న ఇన్‌స్పెక్టర్లు శ్రావ్య, శివ గోపాల్ 8 బస్సులపై కేసులు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించి చర్యలు తీసుకున్నట్లు ఉప రవాణా కమిషనర్ మణికుమార్ శుక్రవారం సాయంత్రం తెలిపారు.

పండగ శోభ



కళకళలాడుతున్న గురజాడ కూడలి

నగర పాలక సంస్థలో రూ.1.20 కోట్లతో పైడితల్లి జాతరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన కూడళ్లు, నగర పాలక సంస్థ కార్యాలయం, గురజాడ ఇంటిని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేస్తున్నామని కమిషనరు పి.నల్లనయ్య 'న్యూస్‌టుడే'కు తెలిపారు. -న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం




నగర పాలక సంస్థ కార్యాలయం, బుద్ధ విగ్రహం వద్ద విద్యుత్తు దీపాలంకరణ

ఆయుధ పూజ



బొబ్బిలి కోటలో శుక్రవారం సంప్రదాయబద్ధంగా ఆయుధ పూజ జరిగింది. బొబ్బిలి యుద్ధంలో వినియోగించిన కత్తులు, బల్లేలు, ఇతర ఆయుధాలకు మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, సోదరులు ఎమ్మెల్యే బేబినాయన, వినీత్ పూజలు నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రాల ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆర్‌ఎస్‌ఆర్‌కే రంగారావు, తండ్రి ఆర్‌వీజీకే రంగారావు, వారి బంగారు, వెండి సింహాసనాలు, కార్లను పూజించారు. -న్యూస్‌టుడే, బొబ్బిలి



బంగారు సింహాసనానికి పూజలు చేస్తున్న మాజీ మంత్రి సుజయ్, ఎమ్మెల్యే బేబినాయన

యంత్రం.. జీవనోపాధి మంత్రం!

● కేంద్ర ప్రభుత్వ రాయితీలు వర్తింపు ● అఖిల భారత డ్వాక్రా సరస్‌లో ప్రదర్శన

న్యూస్‌టుడే, విజయనగరం మయూరి కూడలి

ఇంటి వద్దనే యంత్రాలను ఉపయోగించుకుని, తద్వారా స్వయం ఉపాధి పెంపొందించుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచన. ఆ దిశగా స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలకు ప్రత్యేకించి కేంద్రం పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ వంటి పథకాల ద్వారా వివిధ రకాల యూనిట్లు అందిస్తోంది. పైడితల్లి, విజయనగరం ఉత్సవాల్లో ఈ ఏడాది డీఆర్డీఏ- వెలుగు ఆధ్వర్యంలో నగరంలోని లోవర్ ట్యాంక్ బండ్ రోడ్డు వద్ద అఖిల భారత డ్వాక్రా బజార్ (సరస్ 2024)ను ఏర్పాటు చేశారు. దీన్ని శుక్రవారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఇందులో వివిధ రకాల స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఇంటి వద్దనే ఉపాధి పొందేందుకు ఉపయోగపడే యంత్రాలను ప్రదర్శించారు. ఫ్లోర్ మిల్లు, మినీ రైస్ మిల్లు, ఫిష్ డ్రైయర్‌లతో పాటు వివిధ రకాలను అందుబాటులో ఉంచారు. వీటి ధరలో 10 నుంచి 20 శాతం చెల్లిస్తే మిగిలిన మొత్తం రుణంగా బ్యాంకులు మంజూరు చేస్తాయి.

ఆరు గంటల్లో ఎండు చేపలు

ఈ ఫిష్ డ్రైయర్‌లో నేరుగా చెరువు, సముద్రంలో పట్టిన పచ్చి చేపలను వేస్తే ఆరు గంటల్లో వాటిని పూర్తిగా ఎండు చేపలుగా మార్చేస్తుంది. ఒకేసారి 25 కిలోల చేపలు వేసుకోవచ్చు. దీని ఖరీదు రూ.88 వేలు ఉంటుంది. విద్యుత్తు కూడా తక్కువ అవుతుంది. వీటిని రాయితీపై అందిస్తారు.



పిండి మిల్లుతో ఆదాయం



ఈ పిండి మిల్లుతో మహిళలు ఎక్కువ ఆదాయం పొందవచ్చు. ఇంటి వద్దనే ఏర్పాటు చేసి తద్వారా అన్ని రకాల (పొడి, తడి) పదార్థాలను ఒకేసారి అయిదు కిలోల వరకు వేసుకొని ఆడుకోవచ్చు. విద్యుత్తు కూడా రోజంతా ఉపయోగించినా 2 నుంచి 4 యూనిట్ల వరకు అవుతుంది.

హోటళ్లకు ఉపయుక్తం..



ఈ అట్టా కేండేర్ యంత్రం ఎక్కువగా హోటళ్లతో పాటు కొంత మంది మహిళలు ఇంటి వద్దనే తయారు చేసే ఆహార పదార్థాలకు ఉపయోగిస్తారు. నేరుగా పిండిని ఇందులో వేస్తే ముద్ద తయారు చేస్తుంది. గంటకు 20 కిలోల అన్ని రకాల పిండిని ముద్దగా చేసి ఇస్తుంది.

విద్యుత్తు వ్యయం తక్కువే..



ఈ మినీ మిల్లును ఇంట్లోనే ఏర్పాటుచేసుకోవచ్చు. దీనికి ప్రత్యేకించి విద్యుత్తు మీటర్ అవసరం లేదు. తక్కువ విద్యుత్తును వినియోగిస్తుంది. ఇందులో గంటకు 25 కిలోల ధాన్యం అడుతుంది. దీంతో ఇంటి వద్దనే మహిళలు జీవనోపాధులు పొందవచ్చు.

గంటకు 50 కిలోలు..



పొలంలో నూర్పిడి చేసిన ధాన్యాన్ని పాడీ క్లీనర్ యంత్రంలో వేసి మర ఆడుకోవచ్చు. తద్వారా చెత్తను పూర్తిగా శుభ్రం చేస్తుంది. పొల్లు, ధూళిని అంతా వేరు చేసి మంచి ధాన్యం ఇస్తుంది. గంటకు 50 కిలోల ధాన్యం వేసుకోవచ్చు. చిన్న రైతులకు చాలా ఉపయోగంగా ఉంటుంది.

వృద్ధురాలి అనుమానాస్పద మృతి

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని బాబానగర్ మూడో వీధికి చెందిన బత్తుల యశోద (62) అనుమానాస్పదంగా మృతి చెందారు. గురువారం రాత్రి ఇంట్లో నిద్రించిన ఈమె శుక్రవారం ఉదయం చాలా సమయం అయినా బయటకు రాకపోవడంతో కింద ఇంట్లో ఉంటున్నవారు గుర్తించి తలుపు కొట్టినా ప్రయోజనం లేకపోయింది. స్థానికులు తలుపులు తెరిచి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రాజాం ఎస్సై రవికిరణ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బయట వ్యక్తులెవరూ లోనికి వచ్చిన ఆనవాళ్లు లేవని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఈమె కుమారులు వేర్వేరు ప్రాంతాల్లో ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. భర్త మృతి చెందడంతో ఒంటరిగానే ఉంటున్నారు. కుమారుడు గిరీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు సీఐ గిరీష్‌కుమార్ తెలిపారు.

కుటుంబ కలహాలతో బలవన్మరణం

బాడంగి(రామభద్రపురం), న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బాడంగి మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై తారకేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. బొబ్బిలి పట్టణానికి చెందిన సి.రామారావు(41) గురువారం మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య మందలించింది. మనస్తాపానికి గురై అత్తవారి ఊరు బాడంగి మండలం వీరసాగరం శివారుకు చేరుకుని పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న బంధువులు బాడంగి సీహెచ్‌సీకి, అక్కడి నుంచి విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రామారావు శుక్రవారం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సెలవులకు వచ్చి మృత్యువాత



షణ్ముఖ్ (పాత చిత్రం)

గుర్ల, న్యూస్‌టుడే: వ్యాను ఢీకొన్న ఘటనలో బాలుడు మృతి చెందిన సంఘటన పాలవలసలో శుక్రవారం చోటు చేసుకుంది. గుర్ల ఎస్సై పి.నారాయణరావు అందించిన వివరాల ప్రకారం.. విశాఖపట్నానికి చెందిన చింతల ఈశ్వరరావు కుమారుడు షణ్ముఖ్ (5) దసరా సెలవులకు తాతగారింటికి వచ్చాడు. గ్రామంలోని ఓ కల్లం వద్ద ఆడుకుంటుండగా శుక్రవారం వ్యాను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే విజయనగరం ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గుర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	138	246	256